# వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

- ఆయా గ్రామాల్లో జీవాలకు టీకాలు



మొయినాబాద్: అమ్డాపూర్‌లో జీవాలకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న డాక్టర్ దేవీరెడ్డి



షాబాద్ మండలం హైతాబాద్‌లో జీవాలకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

షాబాద్, మే 23: జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కుమ్మరిగూడ, కక్కులూర్, హైతాబాద్, రేగడిదోస్వాడ తదితర గ్రామాల్లో సిబ్బందితో కలిసి జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గొర్రెలు, మేకలు పోషించుకునే జీవనం సాగించే వారికి మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి తమకు సమాచారం అందించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాణి, శ్రీను, కృష్ణమూర్తి, సుధాకర్, సాగర్, రైతులు తదితరులున్నారు.

మొయినాబాద్ : జీవాలకు చిటిక వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి దేవీరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్‌లో గురువారం 800 జీవాలకు చిటిక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం ఆరంభంలో మొలకెత్తే గడ్డిని తినడంతో ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. రోగ నిరోధక శక్తి పెరగడానికి తప్పనిసరిగా ఈ టీకాలు వేయించాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో అనంతపద్మనాభస్వామి కల్యాణం

కొత్తూరు, మే 23 : పెంజర్ల అనంతపద్మనాభస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం స్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనితారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ శ్రీలత, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఉమ్మడి మండలం మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మామిడి జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, సుదర్శన్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బాల్‌రాజ్, దేశాల భీమయ్య హాజరయ్యారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

మంచాల, మే 23 : మంచాల మండలం బోడకొండ, ఆరుట్ల, మంచాల గ్రామాల్లో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎంపీడీవో బాలశంకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లను అధికారులు ఎప్పుడికప్పుడూ కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం కేంద్రాల వద్ద రైతులకు సరిపడా బస్తాలను ఇవ్వడమే కాకుండా వర్షం వస్తే వడ్లు తడవకుండా ఉండేందుకు వారికి టార్పాలిన్ కవర్లు అందజేయాలని కోరారు. డీసీఎంఎస్ అధికారులు వెంటనే రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి సకాలంలో వారి ఖాతాల్లో డబ్బులు జమచేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి జ్యోతిశ్రీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై రైతులకు జనుము, జీలుగ విత్తనాలు

చేవెళ్ల రూరల్, మే 23 : చేవెళ్ల మండల పరిధిలోని 5 క్లస్టర్ల రైతు వేదికలకు సంబంధించి గ్రామ పంచాయతీల రైతులకు 60 శాతం సబ్సిడీతో జనుము, జీలుగ విత్తనాలు ముడిమ్యాల్ పీఏసీఎస్‌లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి తులసి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనుము 240 క్వింటాళ్లు, జీలుగ 8.7 క్వింటాళ్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని, జనుములు 40 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.1448, జీలుగ 30 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.1116 రైతులు చెల్లించి తీసుకుపోవాలన్నారు.

విత్తనాలు అవసరం ఉన్న రైతులు సంబంధిత రైతు వేదికలను సంప్రదించి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లను మండల వ్యవసాయ విస్తరణాధికారులకు అందజేసి అనుమతి స్లిప్ తీసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 3న మండలం సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నంరూరల్, మే 23 : ఇబ్రహీంపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ 3న మండల పరిషత్ అధ్యక్షులు కృపేశ్‌అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో క్రాంతికిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలి

- ఎంపీపీ కొప్పు సుకన్య



దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ సుకన్య

యాచారం, మే 23 : దవాఖానకు వచ్చే రోగులకు వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను గురువారం ఆమె సందర్శించారు. రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. దవాఖానకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మాట్లాడారు. రోగుల పట్ల శ్రద్ధతో వైద్య సేవలు అందించాలని ఆమె కోరారు. రోగులకు నిత్యం భోజనం తప్పనిసరిగా వడ్డించాలని సూచించారు. మండలంలో ఉన్న పన్నెండు బస్తీ దవాఖానలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర వైద్య విధాన పరిషత్‌కు మారినా వైద్యుల తీరుమారకపోవడం సరికాదన్నారు. ఇకపై అన్ని రకాల వైద్య సేవలను ఇక్కడే నిర్వహించాలని సూచించారు. అలసత్వం వహిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి రాజ్యలక్ష్మి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

- మండల పంచాయతీ అధికారి విఠలేశ్వర్‌జీ



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో విఠలేశ్వర్ జీ

చేవెళ్ల రూరల్, మే 23 : గ్రామాల్లోని హరితహారం నర్సరీల్లో మొక్కల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని మండల పంచాయతీ అధికారి విఠలేశ్వర్‌జీ అన్నారు. గురువారం కౌకుంట్ల గ్రామంలో హరితహారం నర్సరీ, పల్లె ప్రకృతివనం, చెత్త డంపింగ్ యార్డు, వైకుంఠధామాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో నాటడానికి సిద్ధంగా ఉన్న మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకునేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గతంలో నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోయాలన్నారు. గడ్డి తొలగింపు తదితర వాటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎంపీవో వెంట పంచాయతీ కార్యదర్శి దేవేందర్ గౌడ్, గ్రామ పంచాయతీ సిబ్బంది, వన సంరక్షకుడు ఉన్నారు.



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వనపర్తి జిల్లా బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య నేపథ్యంలో నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి కేటీఆర్ గురువారం కొల్లాపూర్ వెళ్లారు. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో కేటీఆర్‌ను దేవేందర్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

– కొత్తూరు, మే 23

## స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు భానుప్రసాద్, శివరామరాజు

ఇబ్రహీంపట్నంరూరల్, మే 23 : కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా నిర్వహించే నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో ఎలిమినేడు ఉన్నత పాఠశాల విద్యార్థులు నేరెళ్ల భానుప్రసాద్, నేరళ్ల శివరామరాజు ఎంపికయ్యారని హెచ్‌ఎం సుధాకర్ గురువారం తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అభినందించినట్లు తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులకు నాలుగేండ్ల పా టు ప్రతి ఏడాది రూ.12వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం అందజేయనున్నట్లు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆమనగల్లు, మే 23 : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి, మండల పరిధిలోని పోలేపల్లితో పాటు ఆ ఫీడర్‌పై ఉన్న ఇండ్రస్టీస్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మంగళపల్లిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గురువారం ఏఈ సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. విఠాయిపల్లి 11కేవీ ఫీడర్, పోలేపల్లిలో33 కేవీ ఫీడర్, మంగళపల్లి 11కేవీ ఫీడర్ లైన్లలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**యాచారం, మే23:** విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనిలో భాగంగా మండలంలోని మంథన్‌గౌరెల్లి, చింతుల్ల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథన్‌గౌరెల్లిలో అగ్రికల్చర్ ఫీడర్, చింతుల్లో కోల్డ్ స్టోరేజ్ ఫీడర్‌కు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

## అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు



డీపీవోకు ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ నాయకులు

పెద్దఅంబర్‌పేట, మే 23: అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గ్యార మల్లేశ్ కోరారు. గురువారం డీపీవో సురేశ్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. గౌరెల్లి గ్రామంలోని 206, 191 సర్వేనంబర్‌లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఎంపీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు చిత్రం కృష్ణ, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

## దెబ్బ తిన్న రోడ్డుకు మరమ్మతులు



జేసీబీతో రోడ్డులో మట్టిని తొలగిస్తున్న దృశ్యం

చేవెళ్ల రూరల్, మే 23 : వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాల్లో ప్రధాన రోడ్లతో పాటు గల్లీ రోడ్లు దెబ్బతిన్నాయి. చేవెళ్ల మండల పరిధిలోని హస్తేపూర్ గ్రామ రోడ్డుపై పూర్తిగా మట్టితో నిండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన యువకుడు కిష్టాపురం హరీశ్ స్పందించి జేసీబీతో మట్టిని తొలగింపజేసి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్డును క్లియర్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు.

## చన్వెల్లిలో క్రికెట్ టోర్నమెంట్



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

చేవెళ్ల రూరల్, మే 23 : చేవెళ్ల మండల పరిధిలోని చన్వెల్లి గ్రామంలో ఎండీ నిజాముద్దీన్, ఎం.విజయ్‌కుమార్ స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో 5 టీంలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.30 వేలు జి.ప్రభాకర్‌రెడ్డి, రెండవ బహుమతి రూ.15 వేలకు సంబంధించిన నగదును శ్రీనివాస్ చారి మృతులు నిజాముద్దీన్, విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రాజేందర్ గౌడ్, వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భూపతిరెడ్డి, జంగారెడ్డి, తిరుపతి రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకటేశ్, బాలకృష్ణారెడ్డి, నర్సింహులు, దీపక్ రెడ్డి, జంగారెడ్డి, చింటు, ఆర్గనైజర్స్ నర్సింహులు, రమేశ్, శ్రీనివాస్, విశాల్ నాగేశ్, రవివర్మ పాల్గొన్నారు.

# కేంద్రంలో బీజేపీ వస్తే ఉపాధి హామీ రద్దే

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్



కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నాయకులు

యాచారం, మే 23 : కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తుందని, అందుకు కుట్రలు జరుగుతాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్, అధ్యక్షుడు పి.అంజయ్య అన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లిలో కొనసాగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే ఉపాధి హామి చట్టానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసే వరకు ఉద్యమాలు చేపడుతామన్నారు. ఇందుకోసం ఈ నెల 29న ఇబ్రహీంపట్నంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జగన్, పోలె శివ, జంగయ్య, నారాయణ, శ్రీకాంత్, రాములు, జంగమ్మ, నారయ్య తదితరులున్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

రెండు భవనాల్లో అదనపు అంతస్తుల కూల్చివేత

మొండిగా వ్యవహరించే నిర్మాణదారులపై కేసులు నమోదు చేస్తాం

పంచవటికాలనీలో నేడు కూల్చివేతలు: టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్



అల్కాపూర్ టౌన్‌షిష్‌కాలనీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మణికొండ, మే 23: మణికొండ మున్సిపాలిటీల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. కొన్నాళ్లుగా అక్రమ నిర్మాణాల జాతర యథేచ్ఛగా కొనసాగుతుండటంతో స్థానికుల నుంచి ఉన్నతాధికారులకు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ నేతృత్వంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని రోడ్డు నంబరు 29లో అక్రమంగా వెలిసిన రెండు భవనాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. కొన్నిరోజులుగా అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేసినా పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తూ నిర్మాణాలు చేపట్టిన భవనాలను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. అల్కాపూర్ టౌన్‌షిఫ్‌కాలనీలోని రామాలయం ముందు ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని ప్రజలు ఫిర్యాదు చేసినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామాల పరిధిలోని పలు కాలనీల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను త్వరలోనే కూల్చివేస్తామని వెల్లడించారు. పంచవటికాలనీలో నేడు(శుక్రవారం) కూల్చివేతలు చేపట్టనున్నామని టీపీవో సంతోష్‌సింగ్ తెలిపారు. మణికొండ మున్సిపాలిటీలో చాలా చోట్ల అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నట్లు తమ దృష్టి వచ్చాయని వాటిని గుర్తించి నోటీసులు జారీ చేశామని అన్నారు. అయినా మొండిగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.



అల్కాపూర్ టౌన్‌షిష్‌కాలనీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన మున్సిపల్ సిబ్బంది

## కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్, మే 23: విద్యావంతుడు, ఉత్తముడు, ప్రతిభాశాలి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాఖేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ ఉప ఎన్నికల మునుగోడు నియోజకవర్గ ఇంచార్జి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం చౌటుప్పల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ నాయకులు, పట్టభద్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పనితీరు, నాయకత్వ పనితీరులను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని వివరించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గెలిచేందుకు చాలా అనుకూలత ఉన్నదన్నారు. సమావేశంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 31 నుంచి జాతీయ లోక్‌అదాలత్

ఇబ్రహీంపట్నం, మే 23 : రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడానికి 31 నుంచి జూన్ 8 వరకు జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ శ్రీదేవి గురువారం తెలిపారు. రిటైర్డ్ న్యాయమూర్తి జయసింహ అధ్యక్షతన జరిగే ఈ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బొలెరో వాహనం ఢీ.. విద్యార్థిని మృతి

షాద్‌నగర్‌రూరల్, మే 23 : ప్రమాదవశాత్తు బొలెరో వాహనం ఢీకొట్టడంతో విద్యార్థిని మృతి చెందిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలంలోని అన్నారం గ్రామ పరిధిలోని తండాలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కొత్తూరు మండల పరిధిలోని కొడిచెర్ల తండాకు చెందిన కావ్య (14) ఇటీవలే తొమ్మిదో తరగతి ఉత్తీర్ణత సాధించింది. వేసవి సెలవులు కావడంతో కావ్య తన చిన్నమ్మ ఊరైనా కొండాయగట్టు తండాకు వచ్చింది. ఇంటి బయట నిల్చుని ఉండగా బొలెరో వాహనం వెనుకకు తీసే క్రమంలో కావ్యను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కావ్య తండ్రి రామ్‌జీ గతేడాది ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విద్యార్థిని తల్లి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## 2న సహారాస్టేట్స్‌కాలనీ ఎన్నికలు

మన్సూరాబాద్, మే 23: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీలో ఎన్నికల కోలాహలం నెలకొంది. సహారాస్టేట్స్‌కాలనీ మెయింటెనెన్స్ కమిటీని ఎన్నుకునేందుకు జూన్ 2న ఎన్నికలు నిర్వహించనున్నారు. నూతన కమిటీని ఎన్నుకునేందుకు 1002 వేల మంది కాలనీవాసులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నామినేషన్లకు శుక్రవారం చివరి రోజు కావడంతో వెంకటాద్రి ప్యానెల్ నుంచి సయ్యద్ జానీ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్ రెడ్డి, కరణం శ్రీకాంత్ ప్యానెల్ నుంచి అధ్యక్షుడిగా కరణం శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా జ్ఞానేశ్వర్ పోటీ పడుతున్నారు. కమిటీలో మొత్తం 21 స్థానాలకు గాను ఎన్నికలు జరుగుతున్నాయి. వెంకటాద్రి ప్యానెల్ నుంచి, కరణం శ్రీకాంత్ ప్యానెల్ నుంచి 21 మంది తమ నామినేషన్లను గురువారం ఎన్నికల అధికారులకు సమర్పించారు. ఎన్నికల అధికారులుగా నరేందర్‌రెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి, సాయిరాం, సురేందర్ వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇరు ప్యానెళ్లకు చెందిన అభ్యర్థులు వారి మద్దతుదారులు సహకరించాలని కోరారు. ఎన్నికల నియామవళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు ఇరు ప్యానెళ్లకు చెందిన అభ్యర్థులు తమ మద్దతుదారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు.